నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్‌ ఏఈ ఎస్‌.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్స్‌ కాలనీ, గోల్డెన్‌ తులీప్‌ రోడ్‌ నంబర్‌ 1,2,3,4, వెంకటరమణ టాటా మోటార్స్‌ లేన్‌, రాఘవేంద్ర కాలనీ హైటెన్షన్‌ లేన్‌, జేవీజీ హిల్స్‌, శిల్పవ్యాలీ, సెంట్రల్‌ పార్క్‌ ఫేజ్‌–2, మాధవ హిల్స్‌, గాయత్రి లేఅవుట్‌, కాంతివనం తదితర ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదన్నారు.

- వైట్‌ ఫీల్డ్‌ పరిధిలో... బుధవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంజయ్యనగర్‌, వైట్‌ఫీల్డ్‌, రామాలయం టెంపుల్‌ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదని ఏఈ కిశోర్‌ తెలిపారు.

మయూరినగర్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో..

మయూరినగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని లక్ష్మీనగర్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష్మీనగర్‌, కేంద్రీయ విహార్‌ రోడ్డు, మయూరినగర్‌ పార్క్‌, రత్నదీప్‌ వెనుక ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదని తెలిపారు.

20న హెచ్‌సీయూలో స్మారక ఉపన్యాసం

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో అల్లాడి మెమోరియల్‌ ట్రస్ట్‌, స్కూల్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్‌ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని సివిరామన్‌ ఆడిటోరియంలోని ఓల్డ్‌ సైన్స్‌ కాంప్లెక్స్‌లో జస్టిస్‌ ఉమామహేశ్వరం స్మారక ఉపన్యాస కార్యక్రమంలో 'ఇండియన్‌ జుడీషియరీస్‌ రెస్పాన్స్‌ టు రైట్స్‌ ఆఫ్‌ లింగ్విస్టిక్‌ అండ్‌ రెలిజియస్‌ మైనారిటీస్‌' అనే అంశంపై పాట్నాలోని నేషనల్‌ లా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌ ప్రొఫెసర్‌ ఫైజాన్‌ ముస్తఫా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. ఈ కార్యక్రమానికి సోషియాలజీ డిపార్ట్‌మెంట్‌ ప్రొఫెసర్‌ పుష్పేష్‌ కుమార్‌ అధ్యక్షతన నిర్వహిస్తారు.

25 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

గచ్చిబౌలి: మియాపూర్‌ డివిజన్‌ మయూరినగర్‌ కాలనీలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీ నుండి మహాశివ రాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివ రాత్రి సందర్భంగా 25వ తేదీ (మంగళవారం) నుండి 27వ తేదీ (గురువారం) వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. 25న స్వామి వారికి సుప్రభాత సేవా, రుద్రాభిషేకం, ధ్వజారోహణం, సామూహిక లింగాభిషేకం, 26న గణపతి పూజ, రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణోత్సవం, 27న ఉమామహేశ్వరి స్వామి రథం, అన్నప్రసాద కార్యక్రమం, స్వామివారి నంది వాహన సేవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట



సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌: నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని జనప్రియనగర్‌ ఫేజ్‌ 1,2 కాలనీలో యువ నాయకులు నిమ్మల ధాత్రినాథ్‌గౌడ్‌ సొంత నిధులు రూ.4 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మాణిక్యం, జనప్రియనగర్‌ ఫేజ్‌ 1 అధ్యక్షులు జయసూర్య, మల్లిఖార్జున్‌, సుధాకర్‌, దాసు, ప్రవీణ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఎఫ్‌డీడీఐని సందర్శించిన కేవీ విద్యార్థులు



రాయదుర్గం: పీఎంశ్రీ బ్యాగ్‌లెస్‌ డే కార్యక్రమంలో భాగంగా ఫుట్‌వేర్‌ డిజైన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌ (ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్‌ను గచ్చిబౌలి కేవీ ఆరో తరగతి విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఎఫ్‌డీడీఐలో పోస్టు గ్రాడ్యుయేట్‌, గ్రాడ్యుయేట్‌ కోర్సులు చదివే విద్యార్థులకు షూ తయారీపై ఇచ్చే శిక్షణా కార్యక్రమాలను, యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫుట్‌వేర్‌ రంగానికి ఉన్న ప్రాముఖ్యతను నిపుణులు వివరించారు.



మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌ వద్ద జీహెచ్‌ఎంసీ నిర్మించిన ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి



మదీనాగూడ వద్ద ఎస్కలేటర్‌ పని చేయకపోవడంతో మెట్లు ఎక్కుతున్న మహిళ, పిల్లలు



నిర్మించారు సరే.. నిర్వహణేదీ?

ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలను పట్టించుకోని అధికారులు

పనిచేయని లిఫ్టులు, ఎస్కలేటర్లు.. రోడ్డు దాటుతున్న పాదచారులు

చందానగర్‌: పాదచారులు నిత్యం రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలను నిర్మించారు.జాతీయ రహదారిలో ప్రజల సౌకర్యార్థం కోట్లు వెచ్చించి నిర్మించిన ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిల వద్ద నిర్వహణ లోపం కనబడుతుంది. రెండు ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలకు ఎస్కలేటర్లు లేవు. కేవలం లిఫ్టులు మాత్రమే ఉన్నాయి. దీంతో పాదచారులు మళ్లీ యథావిధిగా రోడ్డు దాటుతున్నారు. ఎస్కలేటర్లు లేకపోవడం, ఉన్న లిఫ్టులు పనిచేయకపోవడంతో మహిళలు, వృద్ధులు మెట్లు ఎక్కలేక ఎక్కడ పడితే అక్కడ రోడ్డు దాటుతున్నారు. కాగా జీహెచ్‌ఎంసీ, ప్రైవేట్‌ సంస్థలు సంయుక్తంగా ఎఫ్‌ఓబీలు నిర్మించారు. మియాపూర్‌– చందానగర్‌ వరకు చేపట్టిన ఎఫ్‌ఓబీలలో మియాపూర్‌, ఆల్విన్‌కాలనీ చౌరస్తాలో ప్రైవేట్‌ సంస్థల ద్వారా, మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌ వద్ద, గంగారం జేపీ సినిమాస్‌ ముందు జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మించారు. మియాపూర్‌ నుంచి చందానగర్‌ జాతీయ రహదారి 200 ఫీట్ల విస్తరణ చేపట్టనున్న నేపథ్యంలో ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిల మరమ్మతులు చేపడతారా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

- ముంబాయి జాతీయ రహదారిపై 5 ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలు నిర్మించారు
- కాగా ప్రైవేట్‌ సంస్థలు నిర్మించిన రెండు ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలకు ఎస్కలేటర్లు లేవు. లిఫ్టులు ఉన్నా నిర్వహణ లేకపోవడంతో వృథాగా మారాయి.
- జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఎఫ్‌ఓబీలకు మాత్రం ఇరువైపులా ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది
- లిఫ్టుల ముందు చెత్త చెదారం, మెట్ల వద్ద గుంతలు, బ్రిడ్జి గోడలకు పోస్టర్లు అతికించారు.
- పాదచారుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలకు స్పందన లేదు



గంగారంలోని ఎఫ్‌ఓబీ ఎస్కలేటర్‌ వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

- జన సందోహం, షాపింగ్‌మాల్స్‌ వద్ద ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలు నిర్మించాలని స్థానికులు తెలుపుతున్నారు.
- సూచిక బోర్డులు లేక పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఎస్కలేటర్లు, లిఫ్టుల వద్ద చెత్త చెదారం, మెట్లు దిగే చోట గుంతలు ఏర్పడ్డాయి.
- ఈ ప్రాంతంలో చిరు వ్యాపారులు డబ్బాలు నిర్వహిస్తున్నారు.

మెట్లు ఎక్కలేకపోతున్నాం



మియాపూర్‌– గంగారం వరకు ఉన్న 4 ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిల నిర్వహణకు సిబ్బందిని నియమించాలి. లిఫ్టులు, ఎస్కలేటర్లు పని చేయడం లేదు. దీంతో మెట్లు ఎక్కి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం.

– జయరాం, మదీనాగూడ

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



బ్రిడ్జిల వద్ద సూచిక బోర్డులు లేవు. ఇష్టానుసారంగా పోస్టర్లు అతికిస్తున్నారు. మెట్ల వద్ద గుంత ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– రాజు, దీప్తిశ్రీనగర్‌

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం



యూజీడీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ హమీద్‌పటేల్‌, స్థానికులు

ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్‌ డివిజన్‌లోని ఓయూ ప్రొఫెసర్స్‌ కాలనీలో రూ.75 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌ నిర్మాణ పనులకు కార్పొరేటర్‌ హమీద్‌పటేల్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసరం ఉన్న చోట, నిత్యం మురుగు పొంగుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామన్నారు. ఓయూ ప్రొఫెసర్స్‌ కాలనీలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు తీర్చుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం శరత్‌రెడ్డి, మేనేజర్‌ సందీప్‌, నాయకులు ఊట్లకృష్ణ, తిరుపతిరెడ్డి, దశరథ్‌, శ్రీనివాస్‌ చౌదరి, తిరుపతి, రమేష్‌, రజనీకాంత్‌, తిరుపతియాదవ్‌, కరీం, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే కేన్సర్‌ వైద్య సేవలు

డాక్టర్‌ భరత్‌ పటోడియా

గచ్చిబౌలి: దేశంలోనే మొదటిసారిగా 'ఇంటి వద్దకే కేన్సర్‌ చికిత్స సేవలను' పీఐ కేన్సర్‌ కేర్‌ అందుబాటులోకి తీసుకొచ్చిందని పీఐ కేన్సర్‌ కేర్‌ వ్యవస్థాపకులు, డైరెక్టర్‌, చీఫ్‌ మెడికల్‌ ఆంకాలజిస్ట్‌ డాక్టర్‌ భరత్‌ పటోడియా పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని పీఐ కేన్సర్‌ కేర్‌లో ఇంటి వద్దకే కేన్సర్‌ చికిత్సను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని కేన్సర్‌ రోగులకు 24/7 వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రోగులకు కీమోథెరపీ, బ్రెస్ట్‌ క్యాన్సర్‌ స్క్రీనింగ్‌, కేన్సర్‌ టీకాలను ఇంటి వద్దకు అందిస్తామన్నారు. ఆస్పత్రులలో చికిత్స పొందడం రోగులకు ఒత్తిడిగా ఉంటుందని, కుటుంబ సభ్యుల మధ్య వైద్యం పొందవచ్చన్నారు. కేన్సర్‌ పోరాటంలో మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని, ఇంట్లో చికిత్స తీసుకుంటే అది సాధ్యమవుతుందన్నారు. నర్సింగ్‌ బృందం కీమోథెరపీ చికిత్స చేస్తూ రోగులను నిరంతరం పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రత్యేకమైన డిజిటల్‌ పరికరంతో ఐదు హెల్త్‌ పారామీటర్స్‌ను డాక్టర్‌కు రిపోర్ట్‌ చేస్తారన్నారు.

సర్వేపై అవగాహన

మాదాపూర్‌: మాదాపూర్‌ వార్డు కార్యాలయంలో మంగళవారం కులగణన సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ ఆధ్వర్యంలో సభ్యుడు తిరుమలగిరి సురేందర్‌, బీసీ సంక్షేమం రంగారెడ్డి జిల్లా ఉపసంచాలకులు బి.కేశవరామ్‌, మాదాపూర్‌ కాలనీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డిలు పాల్గొన్నారు. ఇటీవల జీహెచ్‌ఎంసీ నిర్వహించిన కుల గణనలో తమ సమాచారం ఇవ్వని వారికి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సర్వేలో వివరాలు ఇవ్వని వారికి మరో అవకాశాన్ని కల్పించనున్నట్లు తెలిపారు.



ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కొలను వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్‌: మధురానగర్‌ కాలనీలోని అష్టలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు తమ వంతు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్‌ రూ.50 వేలు, బాచుపల్లి మాజీ కార్పొరేటర్‌ కొలన్‌ వీరేందర్‌రెడ్డి రూ.45,678, బాచుపల్లికి చెందిన కొలను కృష్ణారెడ్డి రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు జి.విష్ణువర్ధన్‌రావు, సీహెచ్‌ లింగయ్య, రామలక్ష్మారెడ్డి, వరికుప్పల దశరథ్‌, మాజీ డిప్యూటీ మేయర్‌ ధనరాజ్‌ యాదవ్‌లకు అందజేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గం

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ క్యాంపస్‌లో మంగళవారం స్టూడెంట్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ) హెచ్‌సీయూ 18వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మహాసభ 41 మందితో కమిటీ, 15 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడిగా లెనిన్‌, కార్యదర్శిగా పంకజ్‌, ఉపాధ్యక్షులుగా అతీక్‌ దేబ్రసీత, మోహిత్‌ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా సుభాషిణి, ఆకాశ్‌, కృపలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్‌, పంకజ్‌లు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు.



నేడు వాహనాల వేలం

చందానగర్‌: శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్‌ అండ్‌ ప్రొహిబిషన్‌ స్టేషన్‌లో వివిధ కేసులలో పట్టుబడ్డ వాహనాలకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నామని ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మణ్‌ గౌడ్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మండల పరిధిలో గంజాయి, సారాయి సరఫరా చేస్తూ పట్టుబడ్డ వాహనాలు ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కృష్ణప్రియ ఆదేశాల మేరకు, అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11.00 గంటల నుంచి వేలం పాట ప్రారంభమవుతుందన్నారు.

కేవీలో చేర్యాల్‌ పెయింటింగ్‌ వర్క్‌షాప్‌



రాయదుర్గం: గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయలో 8వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా చేర్యాల్‌ పెయింటింగ్‌ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను ప్రిన్సిపల్‌ జితేంద్ర కుమార్‌ ప్రారంభించారు. 'పీఎం శ్రీ బ్యాగ్‌లెస్‌ డే' కార్యక్రమం కింద మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పెయింటింగ్‌ నిపుణుడు మధు మేరుగోజు విద్యార్థులకు పెయింటింగ్‌లో మెళకువలను నేర్పించారు. అంతకుముందు 7వ తరగతి విద్యార్థులకు బ్యాగ్‌లెస్‌ డే కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు కథలు చెప్పడం సైన్స్‌ ప్రయోగాలు, సుడోకు, రంగురంగుల కాగితాలలో కళాకృతుల తయారీని నేర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.... సోమవారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుమందికి రూ.1500 జరిమానా ,ఒకరికి రూ. 2 వేలు, మరో వ్యక్తికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

అందరి సహకారంతోనే ఆర్టీసీ అభివృద్ధి



ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ ఆర్‌ఎం కవిత, డిపో మేనేజర్‌ హరి

మూసాపేట: ఉద్యోగుల అందరి సహకారంతోనే ఆర్టీసీ అభివృద్ధి సాధిస్తుందని డిప్యూటీ ఆర్‌ఎం కవిత అన్నారు. కూకట్‌పల్లిలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం పవర్‌ కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులు ఆర్‌టీసీ సంస్థ తమది అనే భావనతో పని చేసినప్పుడే సంస్థ అభివృద్ధిపథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌ హరి, ఎం.ఎఫ్‌. రాజేశ్వరి, ఓఎస్‌ రమేష్‌, వెల్ఫేర్‌ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోమాలు, ప్రత్యేక పూజలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్‌ ఎంఐజీ కాలనీలోని రామాలయంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం , హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక లక్ష తులసిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి నింబ, కదళీ, సింధూర, తమలపాకులతో విశేష పూజలు చేశారు. ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణచార్యుల నేతృత్వంలో చేపట్టిన పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



భెల్‌ ఎంఐజీ కాలనీ రామాలయంలో స్వామి వారికి లక్ష తులసి పూజ

అండర్‌ బ్రిడ్జి వద్ద రాకపోకలు ప్రారంభం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి నుంచి వాహనాలు రాకపోకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అండర్‌ బ్రిడ్జి నుంచి వరదను మళ్లించేందుకు గాను బాక్స్‌ టైప్‌ డ్రైన్‌ పనులు చేపట్టడంతో తారానగర్‌ నుంచి గచ్చిబౌలి వైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో 4 నెలలుగా వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో ఇంజనీరింగ్‌ అధికారులు మార్గం సుగమం చేశారు. పదిహేను రోజుల్లో బ్రిడ్జి వద్ద పనులు పూర్తి చేస్తామని, వాహనదారులు సహకరించాలని శేరిలింగంపల్లి సర్కిల్‌ డీఈ ఆనంద్‌ కోరారు. వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలు కల్పించడంతో స్థానికులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాలలకు తనిఖీ బృందాలు



- ఇంటర్నల్‌ మార్కుల పరిశీలనకు 17 టీమ్‌లు..
- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేయనున్న టీచర్లు

బంజారాహిల్స్‌: పదో తరగతి పరీక్షలు మార్చి 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల నమోదు ప్రాధాన్యత సంతరించుకుంది. పది విద్యార్థులకు వారి పరిజ్ఞానాన్ని బట్టి 20 మార్కులు ఇంటర్నల్‌ మార్కులుగా ఇవ్వనున్నారు. ఈ మార్కులు విద్యార్థుల ఉత్తీర్ణతకు ఎంతో కీలకం కావడంతో తనిఖీ బృందాలు ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని కూలంకషంగా పరిశీలిస్తున్నారు. విద్యాశాఖ ఖైరతాబాద్‌ జోన్‌ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్‌, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్‌, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్‌, అమీర్‌పేట, సనత్‌నగర్‌ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 153 ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల తనిఖీలకు 17 బృందాలు ఏర్పాటుచేశారు. ఈ బృందాలు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించనున్నాయి. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా 20 ఇంటర్నల్‌ మార్కులు వేసే పద్ధతి గత పదేళ్లుగా కొనసాగుతుంది. గత నవంబర్‌లో ఈ పద్ధతికి విద్యాశాఖ స్వస్తి పలుకుతున్నట్లుగా ప్రకటించినప్పటికీ విద్యార్థులను తాము ఇంటర్నల్‌ మార్కుల విధానంతో సంసిద్ధం చేశామని ఉపాధ్యాయ సంఘాలు సూచించడంతో ఈ ఏడాది మాత్రమే ఆ పద్ధతిని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇంటర్నల్‌ మార్కుల పరిశీలనకు తనిఖీ బృందాలను ఏర్పాటుచేశారు. ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్‌లో ఈ మార్కుల నమోదు ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ పరీక్షల విభాగం ఆదేశించింది. ఇందుకోసం మంగళవారం నుంచి ఆయా పాఠశాలల్లో ఈ బృందాలు పరిశీలిస్తున్నాయి.

వాస్తవాలు తెలుసుకునేందుకు..

అంతర్గత మార్కుల నమోదు విషయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా సామర్థ్యం లేని విద్యార్థికి కూడా తమ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత కోసం 20 మార్కులు వేస్తున్నట్లు గతంలోనే ఫిర్యాదులు అందాయి. ప్రైవేటు పాఠశాలల్లో అంతర్గత మార్కుల నమోదుపై పలు ఫిర్యాదులు ఉన్నాయి. ఫెయిలైన విద్యార్థికి కూడా 20 ఇంటర్నల్‌ మార్కులు వేసిన సందర్భాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఫార్మేటివ్‌ పరీక్షల్లో వాస్తవంగా మార్కులు నమోదు చేశారా? ఇష్టానుసారంగా వేశారా..? అన్నది ఈ బృంద సభ్యులు పరిశీలిస్తారు. లోపాలు ఉంటే వాటిని సరిజేసిన తర్వాతనే ఇంటర్నల్‌ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కాగా ఈ పరిశీలనకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులనే నియమించారు. ఒక్కో బృందంలో హెచ్‌ఎంతో పాటు భాషా పండితుడు, స్కూల్‌ అసిస్టెంట్‌ స్థాయి ఉపాధ్యాయుడు ఉంటాడు. జిల్లా అధికారులు ఒక్కో బృందానికి 10 పాఠశాలల బాధ్యతలు అప్పగించారు. టీచర్లు పరిశీలించి ఆమోదించిన మార్కులను గడువు లోగా ఆన్‌లైన్‌లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది.

విద్యుత్‌ మీటర్లు ఇవ్వండి

మణికొండ: ఇళ్లు నిర్మించుకున్నా అధికారులు విద్యుత్‌ మీటర్లు ఇవ్వకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇకనైనా మంజూరు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ కార్యదర్శి ఎం.ప్రదీప్‌ కుమార్‌ కోరారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్‌ మీటర్లను ఇవ్వటం లేదన్నారు. జీఓ 111 పరిధిలో ఉన్న గ్రామమని విద్యుత్‌ మీటర్లను ఇవ్వకపోవటం భావ్యం కాదన్నారు. ప్రజలు నిర్మించుకున్న గృహాలకు మున్సిపాలిటీ పన్నులు తీసుకుంటున్నపుడు విద్యుత్‌ మీటర్లు ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు. మంగళవారం విద్యుత్‌శాఖ ఏడీఈ అంబేడ్కర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్‌, రాము, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.



ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు